# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

# ప్రాంతీయ వార్తా విభాగం

# ప్రాంతీయ వార్తలు

తేది : 02 -02-2026 సమయం : 1.20 గంటలు

## ముఖ్యాంశాలు

1. **అమరావతి నిర్మాణంలో భాగంగా పలు ప్రాజెక్టులను అధ్యయనం చేయడానికి లండన్ చేరుకున్న మంత్రి పి.నారాయణ బృందం.**
2. **ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని తెలిపిన మంత్రి నిమ్మల రామానాయుడు.**
3. **వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్న మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి.**
4. **వైద్య ఆరోగ్య రంగ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్న మంత్రి వై. సత్యకుమార్ యాదవ్.**

----------------------

అమరావతి నిర్మాణంలో భాగంగా పలు ప్రాజెక్టులను అధ్యయనం చేయడానికి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ నేతృత్వంలోని బృందం యునైటెడ్ కింగ్‌డమ్ లోని లండన్ కు ఈరోజు చేరుకుంది. ఈ పర్యటనలో భాగంగా లండన్ సిటీ కార్పొరేషన్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ రిచర్డ్స్ తో సమావేశం అయ్యారు. ఈ మధ్యాహ్నం బెటార్సి

పవర్ స్టేషన్ ను మంత్రి నారాయణ బృందం సందర్శించనుంది. అనంతరం థేమ్స్ రివర్ ఫ్రంట్ ప్రాంతాన్ని పరిశీలించనున్నారు. ఈ సాయంత్రం లండన్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శిస్తారు.

----------------------

వస్తు సేవల పన్ను - జిఎస్టి వసూళ్లలో రాష్ట్రం గత నెలలో 6.72 శాతం వృద్ధి నమోదు చేసిందని రాష్ట్ర పన్నులశాఖ ముఖ్య కమీషనర్ బాబు. ఎ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరిలో నికర జిఎస్‌టి వసూళ్లు 3 వేల డెబ్బై మూడు కోట్ల రూపాయలుగా నమోదయ్యాయని, 2017లో జిఎస్‌టి అమలులోకి వచ్చినప్పటి నుండి జనవరి నెలలో ఇదే అత్యధికమని వెల్లడించారు. రాష్ట్ర ఆదాయం జనవరిలో 4 వేల 7 వందల 4 కోట్ల రూపాయలుగా ఉందని, గత ఏడాది ఇదే నెలలో ఇది 4 వేల 3 వందల 96 కోట్ల రూపాయలుగా నమోదైందన్నారు. ప్రొఫెషనల్ ట్యాక్స్ వసూళ్లు 25.60 శాతం మేర పెరిగి 38 కోట్ల రూపాయలకు చేరుకున్నట్లు తెలిపారు.

----------------------

ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో 59 మందికి 25 లక్షల రూపాయల మేర ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఈరోజు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

----------------------

2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 10 లక్షల నుంచి 40 లక్షలలోపు జనాభా ఉన్న 22 నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం 16వ ఆర్థిక సంఘం 56 వేల వంద కోట్ల

రూపాయలు కేటాయించింది. ఈ నగరాల జాబితాలో రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ నగరాలు ఉన్నాయి. ఈ నిధులతో ఆ నగరాల్లో ఇప్పుడున్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించడం, వరదనీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలను వేరుగా చేయడం, మురుగునీటి పారుదల వ్యవస్థలేని ప్రాంతాలకు ఆ సదుపాయాల్ని విస్తరించడం లాంటి పనులు చేస్తారు. నగరాల్లోని ప్రత్యేక సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారిస్తారు.

-----------------------

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో నిన్న ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు, హైస్పీడ్ రైల్వే కారిడార్ లో ఆంధ్రప్రదేశ్ కు భాగస్వామ్యం కల్పించడం, అదేవిధంగా ఆదాయ పన్ను చెల్లింపులను సులభతరం చేయడం వంటి పలు నిర్ణయాల పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్ పై ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన విద్యార్థి రాయపాటి జగదీష్ ఆకాశవాణితో మాట్లాడుతూ..

వాయిస్.. 25 సెకన్లు

-----------------------

వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. ప్రకాశం జిల్లా 57వ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలియజేస్తూ..

వాయిస్.. 25 సెకన్లు

-----------------------

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ లో నిన్న ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ పై తిరుపతి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని అన్ని వర్గాల

ప్రజల అభ్యున్నతికి ఈ బడ్జెట్ ఎంతగానో ఉపయోగపడుతుందని తిరుపతి జిల్లాకు చెందిన గురవారెడ్డి పేర్కొంటూ..

..వాయిస్...30 సెకన్లు

-----------------------

వైద్య, ఆరోగ్య రంగ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. విజయనగరం జిల్లా ఎస్.కోట ఏరియా ఆసుపత్రి వద్ద 12 కోట్ల 60 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన 100 పడకల ఆసుపత్రి భవనాన్ని, డయాలసిస్ యూనిట్ ను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

-----------------------

గత ఆరు నెలలుగా బంగ్లాదేశ్ నిర్బంధంలో ఉన్న రాష్ట్రంలోని విజయనగరం జిల్లాకు చెందిన తొమ్మిది మంది మత్స్యకారులు ఈరోజు స్వదేశానికి చేరుకున్నారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్ పర్యవేక్షణలో వీరు సురక్షితంగా విశాఖపట్నం చేరుకున్నారు. 2025 అక్టోబర్‌లో వేటకు వెళ్లిన మత్స్యకారులు సరిహద్దు జలాలను దాటారని బంగ్లాదేశ్ నేవీ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత వారిని అరెస్ట్ చేసి బాగర్‌హాట్ జైలుకు తరలించారు. అనంతరం భారత దౌత్య అధికారులు నిరంతరం బంగ్లాదేశ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి వారిని రాష్ట్రానికి తీసుకొచ్చారు. ప్రభుత్వానికి మత్స్యకారులు, వారి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

-----------------------

జింబాబ్వేలో జరుగుతున్న ఐసిసి అండర్-19 వన్డే క్రికెట్ ప్రపంచకప్ సెమీఫైనల్లోకి భారత జట్టు ప్రవేశించింది. నిన్న పాకిస్తాన్ తో జరిగిన మ్యాచ్ లో విజయం సాంధించడంతో సెమీ ఫైనల్ కి చేరుకుంది. ఈనెల 4వ తేదీన ఆఫ్ఘనిస్థాన్, భారత్ జట్ల మధ్య సెమీ ఫైనల్ మ్యాచ్

జరగనుంది. మరో వైపు ఈ నెల 7వ తేదీ నుంచి ఐసీసీ టీ20 ప్రపంచకప్ పోటీలను భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఇందులో 20 దేశాలు పాల్గొంటున్నాయి.

-----------------------

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ తెలిపారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొని ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు నిర్దేశించిన గడువులోనే పరిష్కరిస్తున్నట్లు ఆయన వివరించారు.

-----------------------

ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువ ట్రోపో ఆవరణములో ఈశాన్య, తూర్పు దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, యానాం, రాయలసీమల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =